క్లుప్తంగా

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

పెంచికల్‌పేట్: కొత్తగా పట్టా పుస్తకం వచ్చిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని పెంచికల్‌పేట్ ఏవో రాజుల నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉన్న రైతులు కొత్త పట్టా పాసు పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు, బీమా నమోదు పత్రం స్థానిక ఏఈవోలకు అందజేయాలని సూచించారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దహెగాం: కొత్త పట్టా పాస్ పుస్తకం వచ్చి, ఇదివరకు రైతుబీమా చేసుకోని రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి రాజులనాయుడు శనివారం కోరారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేస్తున్న సూపర్‌వైజర్ శంకరమ్మ

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ మాట్లాడుతూ విద్యతోనే భవిష్యత్తు ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో శిశు, మహిళా సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. ఆరోగ్యం, చదువుపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, పోషకాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీలు మంగళ, వీణ, ఆశా కార్యకర్తలు కమల, మంగ, తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

కాగజ్‌నగర్‌రూరల్: రానున్న మూడు రోజుల్లో వర్షాలు అధికంగా ఉన్నందున పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య సూచించారు. అత్యవసర సమయంలోనే ఇంటి నుంచి బయటకు రావాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల్లో, నాలాల్లో నీరు నిలిస్తే, అత్యవసర సేవలకు మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, నంబర్ 8712803804కి సమాచారం అందించాలని కోరారు.

నేడు సంస్మరణ సభ సన్నాహక సమావేశం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రజా యుద్ధనౌక గద్దరన్న సంస్మరణ సభ నిర్వహణకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని ఆదివారం పట్టణంలోని విద్యుత్ ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించనున్నట్లు ప్రజా, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. ఆగస్టు 11న నిర్వహించే సంస్మరణ సమావేశం గురించి చర్చించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి వివిధ సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు.

సొసైటీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



సూచనలు చేస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్

కాగజ్‌నగర్‌రూరల్: కొత్తపల్లి వెంకటలక్ష్మి –చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, అనితలు కోరారు. సొసైటీ ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం నిర్వహించే కంటి శిబిరంలో 11 మందికి శస్త్రచికిత్సలు అవసరం కాగా, శనివారం బెల్లంపల్లి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించేందుకు వారికి సొంత ఖర్చులతో రవాణా, భోజన సదుపాయం కల్పించారు.

‘ఉపాధ్యాయులను బదిలీ చేయాలి’



సభ్యత్వం నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: 317 బాధిత ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని కౌటాల, బోదంపల్లి, ముత్తంపేట, తలోడి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 317 జీవో బాధిత ఉపాధ్యాయులు జిల్లాలో 608 మంది పని చేస్తున్నారని, ప్రభుత్వం ఆయా కమిటీలతో కాలయాపన చేయకుండా వారిని సొంత ప్రాంతాలకు వెంటనే బదిలీ చేయాలన్నారు. ఉపాధ్యాయులకు డీఏలు విడుదల చేయాలని తెలిపారు. సంఘం సభ్యులు రాజు, గణపతి, జ్ఞానేశ్వర్, రమేశ్, రాజేంద్రప్రసాద్, నాగమణి, కవిత, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు..!

- పట్టణంలో విచ్చలవిడిగా సంచరిస్తూ దాడులు
- బయటకు రావాలంటేనే భయపడుతున్న జనం
- కట్టడి చేయాలని డిమాండ్
- పట్టించుకోని అధికారులు



మార్కెట్ ఏరియాలో కుక్కల గుంపు



కుక్కల దాడికి గురైన చిన్నారి (ఫైల్)

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో వీధి కుక్కలు వీరంగం సృష్టిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. జిల్లాకేంద్రంలోని రావులవాడ, టీఆర్‌నగర్, బ్రాహ్మణవాడ, మార్కెట్‌రోడ్డుపై పదుల సంఖ్యలో సంచరిస్తుండడంతో బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. ఇటీవల రాజంపేట ప్రాంతంలో కుక్కలు దాడి చేసిన ఘటనలో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు కుక్కలను వీధుల్లో సంచరించకుండా వాటిని నివారించే చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గుంపులుగా సంచారం..

పట్టణంలోని బ్రాహ్మణవాడలో గల ఓ ప్రైవేటు ప్రాథమిక పాఠశాల సమీపంలో నిత్యం కుక్కలు గుంపులుగా సంచరిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారు పాఠశాల యాజమాన్యానికి కుక్కల సంచారం గురించి తెలుపగా, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని సమాధానం చెబుతున్నారు. అయితే నేటికీ కుక్కల సంచారం మాత్రం ఆగడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెంబడిస్తున్నాయి..



వీధి కుక్కలతో ప్రజలు భయపడుతున్నారు. పాఠశాలలకు వచ్చే చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ఇళ్లకు చేరుకోవాలంటే కుక్కలు వెంబడిస్తున్నాయి. ఒక్కసారిగా గుంపులుగా సంచరిస్తూ భయపెడుతున్నాయి. సంబంధిత అధికారులు వీధి కుక్కలను అరికట్టాలి.

– రవీందర్, బ్రాహ్మణవాడ

అధికారులు చర్యలు చేపట్టాలి



పట్టణంలో వీధి కుక్కలు సంచరించకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల పలు కుక్కల దాడి ఘటనలు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– సాయికృష్ణ, రాజంపేట

స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

- వ్యాధుల నివారణ దిశగా చర్యలు
- ప్రతీరోజు డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్న సిబ్బంది
- మండలంలో 31 గ్రామ పంచాయతీలు



నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేస్తున్న సిబ్బంది

కెరమెరి: మండలంలో గత కొద్ది రోజులుగా విస్తారంగా వానలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదముందని గ్రహించిన పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పారిశుధ్య నిర్వహణకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు. ఎప్పటికప్పుడు తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

ప్రతీ రెండు రోజులకోసారి..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం జనాభా 33 వేలు ఉంది. ఆయా గ్రామ పంచాయతీల్లో ప్రతీ రెండు రోజులకోసారి మురికి నాలాలు శుభ్రపరుస్తున్నారు. ఎక్కడా కూడా మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు చేపడుతున్నారు. పెంటకుప్పల తొలగింపు, ప్రధాన రోడ్లకిరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా చూడడం, రోజూ ఉదయం ట్రాక్టర్ ద్వారా నిల్వ ఉన్న చెత్తను తొలగించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. మురికి నీటిలో లార్వా నివారణకు థెమోపాస్ ద్రావణం వేస్తున్నారు.

రోజువారీ కార్యక్రమాలు..

ఇప్పటికి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రోజువారి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ప్రతిరోజు మురికి నీటిలో ఆయిల్ బాల్స్ వేయడం, మురికి నీరు లేకుండా చేయడం, పాత టైర్లలో, డబ్బాల్లో, డ్రమ్ముల్లో మురికి నీటిని పారబోయడం, పాడుబడిన భవనాలను కూలగొట్టడం, పాఠశాలల్లో పిచికారీలు చేయడం వంటి పనులు నిత్యం చేపడుతున్నారు. దీంతోపాటు వ్యాధుల నివారణ నిమిత్తం గ్రామీణులకు రోగాలపై అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో మొత్తం 251 బ్లీచింగ్ పౌడర్ బ్యాగులు మంజూరు కాగా, సున్నం, థెమోపాస్ బ్యాగులు, బైలార్వా ప్యాకెట్లు త్వరలో పంపిణీ చేయనున్నారు.

ప్రత్యేక కార్యక్రమాలు..



అన్ని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులకు తెలియజేశాం. ఎక్కడ కూడా చెత్త చెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతపై దృష్టి సారించాం. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాం.

– ఎండీ అంజద్‌పాషా, ఎంపీడీవో

గురుపౌర్ణమికి సాయి మందిరం ముస్తాబు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని శిర్డీసాయి మందిరం ఆదివారం గురుపౌర్ణమి వేడుకలకు ముస్తాబైంది. ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. గురుపౌర్ణమి పురస్కరించుకొని వారం రోజులుగా ఆలయంలో భక్తులు సామూహిక సాయి చరిత్ర, గురుచరిత్ర పారాయణం చేస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం భక్తి శ్రద్ధలతో పుస్తక పఠనం చేస్తున్నారు. వ్యాసపౌర్ణమి పురస్కరించుకొని ఆలయంలో ఉదయం 5.15 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సామూహిక గురుచరిత్ర పారాయణం ముగింపు సందర్భంగా పుస్తకపూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1 గంటలకు మహాప్రసాదం(అన్నదానం), రాత్రి పల్లకిసేవ, సామూహిక విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

నేడు బోనాల పండుగ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్ మహంకాళి ఆలయంలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ తెలిపారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం లారీ చౌరస్తా నుంచి ఎస్పీఎం గేటు మీదుగా ఆలయం వరకు బోనాలతో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

కంచె లేక పొంచి ఉన్న ప్రమాదం



తిర్యాణి మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల(బాలుర) ఆవరణలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. పాఠశాల ఉపాధ్యాయులు సమస్యను విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పాఠశాల ఆవరణ నుంచి శాశ్వతంగా తొలగించి వేరేచోట ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. – తిర్యాణి

గొల్లవాగు వంతెన పరిశీలించిన డీఈ



వంతెన పరిశీలిస్తున్న డీఈ రామ్మోహన్ రావు

పెంచికల్‌పేట్: మండలంలోని కొండపల్లి –గొల్లవాడ మధ్య గల ఒర్రెపై ఉన్న వంతెనను కాగజ్‌నగర్ ఇరిగేషన్ డీఈ రామ్మోహన్ రావు శనివారం పరిశీలించారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు వంతెన కొట్టుకు పోయిందన్నారు. ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.2.68 లక్షలు మంజూరు చేయగా టెండరు సైతం పూర్తయ్యిందని పేర్కొన్నారు. త్వరలోనే వంతెన నిర్మాణ పనులను ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట కౌటాల డీఈ సంపత్‌కుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, గ్రామస్తులు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న పలువురు బదిలీ అయ్యారు. గత రెండు రోజులుగా జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌లో మండల వ్యాప్తంగా ఐదుగురు బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. రణవెల్లి పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ మండలంలోని గూడెంకు బదిలీ కాగా అడెపల్లి కార్యదర్శి అనూష కౌటాల మండలం తాటిపల్లికి, గూడెం పంచాయతీ కార్యదర్శి సునీల్ కాగజ్‌నగర్ మండలం ఎన్‌జీవో కాలనీకి, రుద్రాపూర్ పంచాయతీ కార్యదర్శి కైలాష్ జైనూర్ మండలానికి, రవీంద్రనగర్2 కార్యదర్శి రమేశ్ కౌటాల మండలం బోదంపల్లికి, బూరెపల్లి పంచాయతీ కార్యదర్శి తిరుపతమ్మ కౌటాల మండలం తాటినగర్‌కు బదిలీ అయ్యారు. రుద్రాపూర్ కార్యదర్శిగా ఆనంద్, బూరెపల్లి కార్యదర్శిగా బెజ్జూర్ మండలం బారెగూడ కార్యదర్శి విజయ్, రవీంద్రనగర్2 కార్యదర్శిగా కెరమెరి మండలం కార్యదర్శి బొజ్జ సంతోష్, రణవెల్లి కార్యదర్శిగా బెజ్జూర్ మండలం కాటెపల్లి కార్యదర్శి మారుతిలు బదిలీ అయ్యారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పరిశీలన



అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వంజీరి గ్రామానికి వెళ్లే దారిలో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిపోవడంతో శనివారం అండర్ బ్రిడ్జిని ఎమ్మెల్యే హరీశ్‌బాబు పరిశీలించారు. మోటర్లు పెట్టి నీటిని తోడి రాకపోకలను పునరుద్ధరించాలని సూచించారు. గ్రామస్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ప్రసాద్, బీజేపీ జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, నాయకులు డోంగ్రె కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పొంగిన వాగులు



కనువిందు చేస్తున్న చింతలమాదర జలపాతం



కౌటాల: ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

సిర్పూర్(టి): మండలంలో మూడోరోజు ఎడతెరిపి లేని వాన కురుస్తోంది. దీంతో మండలంలోని వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంతో పాటు మండలకేంద్రానికి ఆనుకొని ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు మండలం మీదుగా ప్రవహిస్తున్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. పెన్‌గంగ పరీవాహక ప్రాంత గ్రామాలు మాకిడి, జక్కాపూర్, హుడ్కిలి, వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం, లోనవెల్లి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. మండలంలోని చీలపెల్లి, రావన్‌పల్లి, పూసిగూడ, మేడిపల్లి, ఇటిక్యాల పహాడ్, కాగజ్‌నగర్ మండలంలోని చిన్నమాలిని, మాలిని తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కాగా మండలంలోని పెన్‌గంగ పరీవాహక ప్రాంత గ్రామాల ప్రజలు, లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్(టి) తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామ సమీపంలోని వెంకట్రావ్‌పేట్ –పోడ్సా అంతర్రాష్ట్ర రహదారిలోని అంతర్రాష్ట్ర వంతెన వద్ద పెన్‌గంగ నది నీటి ఉధృతిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఎస్సై దీకొండ రమేశ్, ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్ఐ జుగాడిరావ్, సిబ్బంది ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు పడుతోంది. దాంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. ముసురు వర్షాలతో వాగులు, వంకలు వరద ప్రవాహాలతో పరవళ్లు తొక్కాయి. గంగాపూర్, పులికుంట, పెద్దవాగు, నవేగాం వాగులు వరదనీటితో కళకళలాడాయి. ముసురు కారణంగా పత్తిలో కలుపులు పెరుగుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి తదితర ప్రాంతాల్లో సాగు చేస్తున్న కూరగాయల తోటలు ముసురు కారణంగా దెబ్బతినే ప్రమాదం ఉంది.

కౌటాలలో..

కౌటాల: మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వాగులు, చెరువులతో పాటు వార్ధా, పెన్‌గంగ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కౌటాల –చింతలమానెపల్లి ప్రధాన రహదారిపై గల చింతలపాటి ఒర్రె వంతెనను తాకుతూ ప్రవహించడంతో ఎస్సై మధుకర్ వంతెనను పరిశీలించి రాకపోకలు నిలిపి వేశారు. కౌటాల తహసీల్దార్ పుష్పలత, ఎస్సై మధుకర్ తాటిపల్లి వద్ద వార్ధా నదిని పరిశీలించారు. భారీ వర్షానికి గుండాయిపేట గ్రామానికి చెందిన ఎల్ములే తారబాయికి చెందిన పశువుల కొట్టం కూలింది. కొట్టంలో పశువులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. వర్షానికి కన్నెపెల్లి పంచాయతీ భవనం పైకప్పు పెచ్చులూడిపోయాయి. మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది వరదనీటితో పరవళ్లు తొక్కుతోంది. వరదనీరు పెరగడంతో గంగపుత్రులు చేపల వేట నిలిపివేశారు. వార్ధా, పెన్‌గంగ నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో మహారాష్ట్రకు నాటుపడవల రాకపోకలు నిలిచిపోయాయి.

చింతలమాదరకు జలకళ

తిర్యాణి: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని మందగూడ పంచాయతీ పరిధిలోని చింతలమాదర జలపాతం జలకళ సంతరించుకుంది. జలపాతాన్ని వీక్షించేందుకు ఉమ్మడి జిల్లాతో పాటు కరీంనగర్, వరంగల్, హైదరాబాద్‌తో పాటుగా మహారాష్ట్ర నుంచి వందల సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దరోగపల్లి వద్ద గల ఉచ్చమల్లవాగు ప్రాజెక్టు, ఎల్లూర్ బొక్కివాగు ప్రాజెక్టులోకి వరద నీరు చేరడంతో మత్తడి పొంగి ప్రవహిస్తుంది. పెద్దవాగుకు వరద పోటెత్తడంతో వాగు పరీవాహక ప్రాంతంలోని పంటలు నీట మునిగాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు మురళీగూడ వద్ద ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తుంది. భారీ వర్షానికి బొంబాయిగూడ గ్రామానికి చెందిన గోగు అంకుబాయి ఇల్లు కూలిపోగా బాధిత కుటుంబాన్ని తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్ పరిశీలించారు.



సిర్పూర్(టి): కొట్టుకుపోయిన కల్వర్టు



పెన్‌గంగ నది ఉధృతి పరిశీలిస్తున్న అధికారులు



పెంచికల్‌పేట్: కూలిన ఇంటిని పరిశీలిస్తున్న సిబ్బంది



కౌటాల: గుండాయిపేటలో కూలిన పశువుల కొట్టం



పెంచికల్‌పేట్: బొక్కివాగు ప్రాజెక్టు మత్తడి



కౌటాల: పెచ్చులూడిన కన్నెపెల్లి పంచాయతీ భవనం

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రెబ్బెన: మండలంలోని లేతన్‌గూడ ప్రభుత్వ పాఠశాలలో పని చేసి పదోన్నతిపై సిర్పూర్(టి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లిన దొడ్డిపట్ల రవికుమార్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు సన్మానించి వీడ్కోలు పలికారు. శనివారం లేతన్‌గూడ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, రాధ, ఆశ కార్యకర్త అనిత, మాజీ సర్పంచ్ రాజ్యలక్ష్మి, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్లు రమేశ్, వెంకటమ్మ, గ్రామస్తులు అనిత, సురేశ్, మల్లేష్, మల్లయ్య, రాజేశ్వరీ, సౌందర్య పాల్గొన్నారు.